క్లుప్తంగా

భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న గీతా మండలి సభ్యులు

నరసన్నపేట: కొత్తపల్లిలోని రాధాకృష్ణ ఆలయంలో ఆదివారం భగవద్గీత పారాయణం చేశామని స్థానిక గీతా మందిరం నిర్వాహకులు సూరిబాబు తెలిపారు. అష్టాదశ క్షేత్ర పారాయణం సందర్భంగా పురాతన వేణుగోపాల స్వామి క్షేత్రాలకు వెళ్లి భగవద్గీతను పారాయణం చేస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని శ్రావణ మాసంలో ప్రారంభించినట్లు తెలిపారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలను 18 శ్రీకృష్ణ క్షేత్రాల్లో పారాయణం చేసేందుకు సంకల్పించామన్నారు. ఇప్పటివరకు తొమ్మిది ఆలయాల్లో పూర్తిచేశామన్నారు. గీతా మండలి సభ్యులు 28 మంది పాల్గొన్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని రొతులక్ష్మీపురం గ్రామానికి చెందిన పేద మహిళలకు అదే గ్రామానికి చెందిన పారశెల్లి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. శ్రీరాములు చిత్రపటానికి ట్రస్ట్ అధ్యక్షుడు రామరాజు నివాళులర్పించారు. సర్పంచ్ అంపోలు మధు, రెడ్డి వెంకటరావు, యారబాటి సన్యాసి, బి.బాలరాజు, కె.బాలయ్య, కె.కోటేశ్వరరావు, మన్మథరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



పార్వతీపరమేశ్వరులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడుని మార్గశిర మాసం బహుళ ఏకాదశి సందర్భంగా ఆదివారం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. తిరువీధిలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పరామర్శ..



సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణచైతన్య

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్ రెండో వీధికి చెందిన మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు రమణసాహు తండ్రి సూర్యనారాయణ సాహు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రమణ సాహు కుటుంబాన్ని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆదివారం పరామర్శించారు. సూర్యనారాయణ సాహు చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.సాయి ప్రసాద్, తంగుడు జోగారావు, ముద్దాడ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

ఆహార ప్యాకెట్ల పంపిణీ



ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న సత్యసాయి సమితి సభ్యులు

ఆమదాలవలస: మెట్టక్కివలసలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నారాయణసేవలో భాగంగా పలువురు పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. స్థానిక రైల్వే స్టేషన్, పాలపోలమ్మ అమ్మవారి ఆలయం, లెప్రసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉన్న పేదలకు, యాచకులకు ఆహార ప్యాకెట్లను అందజేశారు. సమితి కార్యవర్గ సభ్యులు డాక్టర్ పి.తాతయ్యలు, ఆకెళ్ల శేషగిరిరావు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామదేవత ఉత్సవాలు

సారవకోట: మండలంలోని తొగిరి పంచాయతీ కొమ్ముమవలసలో ఆదివారంతో గ్రామ దేవత ఉత్సవాలు ముగిశాయి. గల మూడు రోజుల నుంచి గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రామస్తులు ఘటాలతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక, విశేష పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు.

అన్నదాతకు అండగా.. ఆర్‌బీకేలు



టి.కె.పురం రైతు భరోసా కేంద్రం

ఎల్.ఎన్.పేట మండలం వివరాలు..	
మండలంలో గ్రామ పంచాయతీలు	23
మండలంలో రైతు భరోసా కేంద్రాల	12
భవనాలు నిర్మాణం పూర్తయినవి	12
ఒక్కొక్క ఆర్‌బీకే నిర్మాణానికి నిధులు	రూ.23.94 లక్షలు
మండలంలో గ్రామ సచివాలయాలు	12
మండలంలో రెవెన్యూ గ్రామాలు	47
మండలంలో సాగు విస్తీర్ణం	12,850 ఎకరాలు
ప్రధాన పంటలు 	వరి, పెసర, మినుము, మొక్క జొన్న, నువ్వు, ఇతర వాణిజ్య పంటలు

- పంట సాగు సమయంలో సూచనలు, సలహాలు
- ఎరువులు, వ్యవసాయ పరికరాలు వరకు సరఫరా
- పంటల బీమా, ఈ–క్రాప్ నమోదు



తురకపేట ఆర్బీకే వద్ద కియోస్క్‌లో రైతు వివరాలు నమోదు చేస్తున్న వీఏఏ

ఎల్.ఎన్.పేట: విత్తనం వేసుకున్నప్పటి నుంచి పంట దిగుబడిని కొనేంత వరకు ప్రభుత్వం రైతుల పంట్ల ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాగు పరికరాలు సరఫరా చేస్తోంది. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడాల్సిన దుస్థితి తప్పింది. ప్రతీ ఏడాది ఆర్బీకేల్లోనే ఎరువులు, విత్తనాలు సకాలంలో సరఫరా చేస్తోంది. రైతు సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు రైతులకు నేస్తాలుగా మారారు. సాగు ప్రారంభానికి ముందు నుంచే సలహాలు ఇస్తూ రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. గతం కంటే సాగు విస్తీర్ణంతోపాటు పంట దిగుబడులు పెరిగాయి.

నాడు..

చంద్రబాబు పాలనలో వ్యవసాయం దండగ అన్నారు. సాగుకు శాశ్వత విరామం ప్రకటించాలని రైతులకు పిలుపునిచ్చారు. పంటలు వదిలి ప్రత్యామ్నాం వైపు చూడాలన్నారు. విత్తనాలు, ఎరువులు సరఫరాలో రైతులకు చుక్కలు చూపించారు. పంట దిగుబడులు అమ్ముకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఒక్క మాటలో చెప్పాలంటే రైతుల పట్ల చంద్రబాబు ప్రభుత్వం చులకన భావం చూపించింది.

నేడు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత సాగు పద్ధతుల్లో సమూల మార్పులు తీసుకువచ్చారు. రైతున్నలకు జగనన్న ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. పంట పండించాలన్న కోరిక రైతుల్లో బలంగా పెరిగింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతుల ఇంటి వద్దకు ప్రభుత్వ సేవలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సాగు చేపట్టాలన్న ఆలోచన ప్రతి రైతుకూ కలిగింది.



రైతు వద్దకు ప్రభుత్వ సేవలు



ఆర్బీకేల ద్వారా రైతుల వద్దకు ప్రభుత్వ సేవలు తీసుకుని వెళుతున్నాం. రైతులు ఆర్బీకేలకు వచ్చి వారి సమస్యను తెలియజేస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులను సాగు సీజన్‌లో అవగాహన కల్పిస్తున్నాం. ఆర్‌బీకేల ఏర్పాటుతో రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది మరింత చేరువయ్యారు.

– పైడి లతశ్రీ, ఎఓ, ఎల్.ఎన్.పేట

ఆర్బీకేలు అండగా ఉన్నాయి



నేను విత్తనాలు, ఎరువులు కోసం గతంలో మండల కేంద్రానికి వెళ్లి రోజంతా కాపలా కాసేవాడిని. ఉదయం నుంచి సాయంత్రం వరకు లైన్లో ఉండి తోపులాటలు జరిగితే రెండు బస్తాల విత్తనాలు ఇచ్చేవారు. ఎరువులదీ ఆదే పరిస్థితి. నేను విత్తనాలకు, ఎరువులకు వెళ్లిన రోజు పొలంలో పనిచేసేందుకు కూలీని పెట్టేవాడిని. నాకు రోజంతా పని లేకుండా పోయేది. జగనన్న వచ్చిన తరువాత రైతు భరోసా కేంద్రాలు రైతుకు అండగా వచ్చాయి. విత్తనాలు, ఎరువులు కావాలంటే ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని ఆర్‌బీకేకి వెళితే ఇక్కడే ఇస్తున్నారు. రైతులకు అదనపు ఖర్చు తగ్గింది.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన



దూసిపేటలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. దూసిపేట, దూసి ఆర్ఎస్ గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఉత్సాహంతో పాల్గొని తమకు అందుతున్న పథకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిరంజీవినాగ్ మాట్లాడుతూ అవినీతి రహితంగా పరిపాలన సాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. దేశం మొత్తం గర్వించే విధంగా సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందిస్తున్నామని గుర్తు చేశారు. పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టారని వెల్లడించారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం ఇప్పటికే అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిగురుపల్లి దశరథ, పార్టీ నాయకులు తిర్లంగి శ్రీనివాసరావు, కూటికుప్పల సన్యాసిరావు, తమ్మినేని వేణు, గురుగుబెల్లి నీలారావు, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, ఏపీఎం కూర్మారావు, ఎలక్ట్రికల్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నలక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

విధుల్లోకి 86 మంది అంగన్‌వాడీ సిబ్బంది

కొత్తూరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లో ఉన్న 247 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 419 మందికి అంగన్‌వాడీ సిబ్బందిలో 86 మంది విధుల్లో చేరినట్లు సీడీపీఓ విమలకుమారి ఆదివారం తెలిపారు. 172 మంది కార్యకర్తల్లో 39 మంది, 172 హెల్పర్లలో 39 మంది, 75 మినీఅంగన్‌వాడీ కార్యకర్తల్లో 8 మంది విధులో చేరారన్నారు. మిగిలిన సిబ్బంది విధుల్లో చేరాలని సీడీపీఓ కోరారు. విధుల్లో చేరని సిబ్బందిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు తదిపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ముక్కుపుడక బహూకరణ

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ అమ్మవారికి పాతపట్నం యశోదనగర్‌కు చెందిన దినేష్ పాత్రో మూడు గ్రాముల బంగారం ముక్కుపుడకను ఆదివారం బహూకరించారు. ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావుకు ముక్కుపుడకను అందజేశారు. ఆలయ ధర్మకర్తలు కృష్ణారావు, నేతాజీ, ఉపాధ్యాయుడు మురళీమోహన్ పాత్రో, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు ఒడిశా మద్యం సీసాలు స్వాధీనం

- రెండు ద్విచక్ర వాహనాలు సీజ్
- నలుగురిపై కేసు నమోదు

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న సరిహద్దు చెక్కు పోస్టు వద్ద ఎస్ఐ మహమ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళంరూరల్ మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన నలుగురు యువకులు పర్లాకిమిడి నుంచి నరసన్నపేట వైపు రెండు ద్విచక్ర వాహనాలపై ఆరు మద్యం బ్యాటిళ్లను తీసుకువస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ.9,180 ఉంటుందన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి, నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం

- తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్



జంబాడ గిరిజనులతో మాట్లాడుతున్న మామిడి శ్రీకాంత్

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని బొర్రంపేట, జంబాడ గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. జంబాడలో మోటార్ ద్వారా ఏర్పాటు చేసిన పైపులైన్లతో తాగునీరు అందుతుందని, నేరుగా నీరు సరఫరా కావటం వల్ల లీకులు అవుతున్నాయని శ్రీకాంత్ దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. మోటార్ నుంచి నీరు ట్యాంక్‌కు వెళ్లి అక్కడి నుంచి ట్యాపుల ద్వారా నీరు సరఫరా అవుతుందన్నారు. ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ట్యాంక్ నిర్మాణానికి అవసరమయ్యే నిధుల విడుదల కోసం రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయిస్తానన్నారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, పైల తవిటినాయుడు ఉన్నారు.

ముమ్మరంగా కులగణన

నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో కుల గణన సర్వే ముమ్మరంగా సాగుతోంది. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ నిబంధనల మేరకు వివరాలు సేకరించారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ సర్వే ప్రకియ సాగుతోందని, నిర్దేశిత గడువులోగా పక్కాగా కుల గణన చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. వలస వెళ్లిన కుటుంబాలకు ఓటీపీ ద్వారా సర్వే పూర్తి చేయాలన్నారు. గిరిజన గ్రామాల్లో ఆఫ్ లైన్ ద్వారా సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్.ఎన్.పేట: సిద్ధాంతంలో కుల గణన సర్వే చేస్తున్న సిబ్బంది



పొందూరు: రాపాకలో కులగణన చేస్తున్న సచివాలయ సిబ్బంది



కొత్తూరు: మండల కేంద్రంలో కులగణన సర్వే చేస్తున్న బృందం



సారవకోట: గొర్రిబంద పంచాయతీలో చేపడుతున్న కుల గణన

భీమిలి సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపు

పాతపట్నం: విశాఖపట్నం జిల్లా భీమిలిలో ఈ నెల 27వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న సభను విజయవంతం చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ (నెల్లిమెర్ల) పి.వి.సూర్యనారయణ రాజు(సురేష్ బాబు)తో కలిసి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల శంఖారావాన్ని ఉత్తరాంధ్ర నుంచే పూరించనున్నారన్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నాయకులు భారీ సంఖ్యలో తరలి రావాలన్నారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో గెలిపే లక్ష్యంగా సీఎం జగన్ ముందుకు వెళ్తున్నారన్నారు. అందులో భాగంగానే ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం పూరించనున్నారన్నారు. మెళియాపుట్టి, కొత్తూరు జెడ్పీటీసీ సభ్యులు గూడ ఎండయ్య, కె.భాగ్యలక్ష్మి, ఎంపీపీ దొర సావిత్రమ్మ, రెడ్డి రామారావు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అర్జునుడు, ఎం.తాతయ్య, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, పీఏసీఎస్ అధ్యక్షులు సి.హెచ్ సూర్యనారాయణ, ఏ.వి.సురేష్, బాలరాజు, కొల్ల కృష్ణ, మంచు చంద్రయ్య, వై.వెంకటరమణ, జయమునిరావు, రామకృష్ణ, పనుకు మోహన్, తులుగు ప్రవీణ్, జి.అప్పన్న, మురళి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి

- అప్సా రాష్ట్ర నాయకులు మోహన్‌రావు



మాట్లాడుతున్న మోహన్‌రావు

నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని, పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తోందని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని ప్రైవేట్ స్కూల్స్ అప్సా (డెమోక్రాటిక్) సంఘం తరపున తమవంతుగా ఏపీ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అప్సా సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపూడి మోహన్‌రావు అన్నారు. నరసన్నపేటలో ఆదివారం అప్సా జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు 25 శాతం ఫ్రీ సీట్లు పేద విద్యార్థులకు కల్పిస్తున్నామన్నారు. ఏపీ విద్యార్థులు దేశంలోనే మిన్నగా ఉండేందుకు వీలుగా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లపై ఉదాసీనంగా ఉండాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశానికి సంఘం ప్రతినిధులు ఆరంగి గోవిందరావు, కూన శ్రీకాంత్, మెట్ట వైకుంఠరావు, ప్రతాప్, జిల్లా నలుమూలల నుంచి పలు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతా రామమయం



కొత్తూరు: గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

అయోధ్య రామ మందిరంలో సోమవారం బాల రాముడు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామాల్లో రామ నామం మర్మోగింది. సీతారామ ఉత్సవ విగ్రహాలను తిరువీధి నిర్వహించారు. రామాలయాలను అంకరించారు. ఇళ్లపై రాముడి, హనుమాన్ జెండాలు పెట్టారు. బాల రాముని విగ్రహ ప్రతిష్ఠతను టీవీల్లో తిలకించాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు పిలుపునిచ్చారు. పలుచోట్ల హరేరామ సంకీర్తనలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: నివగాంలో సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను తీరువీధి నిర్వహిస్తున్న గ్రామస్తులు



సారవకోట: గొర్రిబందలో రాముని జెండాలు కడుతున్న యువత



సారవకోట: మండల కేంద్రంలోని హరిజన వీధిలో రామ మందిరం చుట్టూ రాముని జెండాలతో అలంకరణ



జలుమూరు: శ్రీముఖలింగంలో పూజలు అందుకుంటున్న సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులు

కారు బోల్తా – నలుగురికి తీవ్ర గాయాలు

కాశీబుగ్గ: పలాస మండలం కొబ్బరిడిూరు జాతీయ రహదారి పక్కన ఆదివారం ఉదయం కారు బోల్తా పడింది. జాతీయ రహదారిపై ప్రయాణిస్తూ కొబ్బరిడిూరు దగ్గరకు వచ్చే సరికి డ్రైవర్ నిద్ర మత్తులో జోగడంతో బండి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. దీంతో బండిలో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరు కోల్‌కతాకు చెందిన వారు. క్షతగాత్రులను పలాస సామాజిక ఆస్పత్రికి తరలించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారని సమాచారం.

లెనిన్‌కు ఘనంగా నివాళి



లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజా పోరాటాలకు మార్క్సిజాన్ని అనువర్తింపజేసి, శ్రమజీవులందరినీ విప్లవ పథాన నడిపించిన ఘనత లెనిన్‌దని సీపీఐ సీనియర్ నాయకులు చాపర సుందర్‌లాల్ అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సీపీఐ కార్యాలయం క్రాంతి భవన్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గ రహిత, దోపిడీ రహిత సమాజం కోసం లెనిన్ ఎనలేని సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డోల శంకరరావు, చిక్కాల గోవిందరావు, మొజ్జాడ యుగంధర్, పట్టణ సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.